ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3



కర్ణాటక వార్తలు

శనివారం 29 మార్చి 2025



ప్రధాని నరేంద్రమోదీతో ఎంపీ తేజస్విసూర్య దంపతులు

ప్రధాని ఆశీస్సులు పొందిన ఎంపీ తేజస్విసూర్య దంపతులు

5

మా బండి నిండిపోయింది..!




- జేడీఎస్ ఎమ్మెల్యేలను ఏం చేసుకోవాలి? : మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మా కాంగ్రెస్ బండి నిండుగా ఉందని, 18మంది జేడీఎస్ ఎమ్మెల్యేలను తీసుకుని ఏం చేయాలని ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళి అన్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓవర్‌లోడ్ అయినా... ఇక్కడివారే కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రస్తుతానికి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నామని, ఇక్కడే వేచి ఉంటామన్నారు. తాను ఆర్ఏసీ కోటాలో ఉన్నానని, కాంగ్రెస్‌లోనే ఉంటానన్నారు. ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుంటే తమకు అవకాశం రావచ్చునన్నారు. ఎవరెన్ని చెప్పినా ఇక్కడ ఏక్‌నాథ్‌శిండే, అజిత్‌పవార్‌లు లేరని, ఆ సామర్థ్యం ఇక్కడ ఎవరికీ లేదన్నారు. మంత్రి రాజణ్ణ హనీట్రాప్ కేసు వేరని, ఎమ్మెల్సీ రాజేంద్రపై హత్యాయత్నం కుట్ర వేరన్నారు. శాసనసభ సమావేశాలు ముగిశాక మంత్రి రాజణ్ణను కలవలేదన్నారు. రాష్ట్రంలో దళిత సమావేశం జరిగినప్పుడు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా వస్తారన్నారు. రణదీప్‌సింగ్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌ను కలిశానన్నారు.

అభివృద్ధి చర్చలకే కేంద్రమంత్రులతో భేటీ

అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కేంద్రమంత్రులను కలిశానని రాజకీయ చర్చలు లేవని మంత్రి జార్కిహొళి అన్నారు. కేంద్రమంత్రులు కుమారస్వామి, సోమణ్ణను కలిశానన్నారు. మాజీ ప్రధాని దేవేగౌడతో కలవడం అకస్మికమన్నారు. పార్లమెంటుకు వెళ్లే మార్గంలో దేవెగౌడ కార్యాలయం ఉందని అక్కడే కలిశానన్నారు.

శంకర్ దాదాలు..!



- రెచ్చిపోతున్న నకిలీ వైద్యులు
- ఏడాదిన్నరలో 900 మంది గుర్తింపు
- 450 మందికి వైద్యశాఖ నోటీసులు
- 228 ఆసుపత్రులకు తాళాలు

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యులు రెచ్చిపోతున్నారు. అమాయక ప్రజలకు, అరకొర వైద్యంతో చికిత్స అందిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటున్నారు. ప్రజలందరికీ సమగ్ర వైద్యం అందుబాటులో ఉండాలని ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏటా వేల కోట్లరూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా సామాన్యులకు ఉన్నతమైన చికిత్స అందించాలని విశ్వప్రయత్నం చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తాలూకాలలో అర్బన్‌సెంటర్‌లతోపాటు జిల్లాస్థాయిలో ఆసుపత్రులు సేవలందిస్తున్నాయి. అయితే రాష్ట్ర రాజధాని బెంగళూరు నుంచి మారుమూల గ్రామం దాకా నకిలీవైద్యుల తాకిడి వెంటాడుతోంది.

మకాం మారుస్తున్నారు.. మళ్లీ ప్రారంభిస్తున్నారు..!

నకిలీ వైద్యులను కూకటివేళ్లతో సహా తొలగించాలని భావించిన వైద్య ఆరోగ్యశాఖ ఏడాదిన్నర కాలంగా తీవ్రమైన కసరత్తు చేస్తోంది. మండ్య జిల్లాలో బెల్లం తయారు చేసే గానుగ కేంద్రాల్లో సిటీ స్కాన్ మిషన్లు పెట్టుకుని లింగనిర్ధారణ పరీక్షలు జరుపుతున్నట్లు గుర్తించారు. అప్పటి నుంచి నకిలీ డాక్టర్ల ఆటలు కట్టించేందుకు ప్రయత్నాలు జరుపుతున్నారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 967మంది నకిలీ వైద్యులు బయట పడడం ఆందోళన కలిగిస్తోంది. అయితే పట్టుబడిన వైద్యులు మరో ప్రాంతానికి మకాం మార్చి చికిత్స కొనసాగించడం మరీ ఆందోళన కలిగిస్తోంది.



సరిహద్దులో తీవ్రమైన సమస్య..

వైద్య ఆరోగ్యశాఖ సమాచారం ప్రకారం 2023 సెప్టెంబరు నుంచి 2025 జనవరి దాకా 967మంది నకిలీ డాక్టర్లను గుర్తించారు. జిల్లాలవారీగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు 450మంది డాక్టర్లకు నోటీసులు జారీ చేశారు. 228 క్లినిక్‌లను మూసివేయించారు. 96మందికి జరిమానాలు విధించారు. వివిధ జిల్లాల కోర్టుల పరిధిలో 70కుపైగా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలు బీదర్, యాదగిరి, రాయచూరు, కలబురగి సహా ఉత్తర కర్ణాటకలోని పలు జిల్లాలతోపాటు కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు జిల్లాల్లోనూ నకిలీ డాక్టర్ల ప్రభావం ఎక్కువగా ఉంది. బీదర్‌లో 213మంది, కోలారులో 115, తుమకూరులో 112, ఇతర జిల్లాల్లో వందలోపుమంది నకిలీ వైద్యులను గుర్తించారు. సరిహద్దు జిల్లాల్లోనూ వీరి ప్రభావం ఎక్కువగా ఉంది. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలనుంచి సరిహద్దు గ్రామాలకు వచ్చి చికిత్స చేసి వెళ్లిపోతున్నారు. వారిని గుర్తించడమే ఒక సవాల్‌గా మారింది. ప్రధానంగా ఈ ప్రభావం కోలారు, బీదర్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నకిలీ డాక్టర్లను గుర్తించే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. ప్రతి జిల్లాలోనూ జిల్లా వైద్యాధికారుల నేతృత్వంలో ప్రత్యేకబృందం ప్రాంతాలవారీగా పరిశీలన జరిపేందుకు వెళ్లి నకిలీ డాక్టర్లను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రంలో నకిలీ వైద్యుల ఆగడాలను కట్టడి చేసేందుకు కేపీఎంఈ చట్టం 2007 సెక్షన్ 21 ప్రకారం తాలూకా వైద్య అధికారులను ప్రాంతీయ పర్యవేక్షకులుగా నియమిస్తారు. వీరు తాలూకా పరిధిలో ప్రైవేటుగా క్లినిక్‌లు నిర్వహించేవారి వివరాలను సేకరిస్తుంటారు. తొలిసారి పట్టుబడితే రూ.25వేలు జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.2.50లక్షల జరిమానా, ఏడాది జైలుశిక్ష, మూడోసారి పట్టుబడితే రూ.5లక్షల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఆంక్షలు ఉన్నాయి. ఇన్ని నిబంధనలు ఉన్నా బెంగళూరులో అతిపెద్ద ఆసుపత్రిగా పేరొందిన విక్టోరియా ఆసుపత్రి సమీపంలోని కేఆర్ మార్కెట్ పరిధిలో రోడ్డుపైనే పండ్లను శుభ్రం చేసే నకిలీ వైద్యులు కొనసాగుతున్నారు. పలుమార్లు అధికారులు దాడులు చేసినా వారి తీరులో మార్పు రావడం లేదు.

సంపూర్ణంగా నకిలీ వైద్యుల కట్టడి

రాష్ట్రంలో సంపూర్ణంగా నకిలీ వైద్యులను కట్టడి చేయదలిచామని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేక్‌దొరై అభిప్రాయపడ్డారు. నకిలీ వైద్యులను కట్టడి చేయాలంటే ప్రాంతాలవారీగా ప్రజల సహకారం అవసరమన్నారు. కొన్నిచోట్ల దాడులు చేస్తే ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండరని, వీరినుంచే వైద్యం దొరుకుతోందని అధికారులను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయన్నారు. నకిలీ డాక్టర్లకు శిక్ష విధించే ప్రక్రియలో తీవ్రమైన జాప్యం జరుగుతోందన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు నకిలీ డాక్టర్ల సమాచారం ఇస్తే సంపూర్ణంగా కట్టడి చేస్తామన్నారు.

రిటైర్డ్ డీజీపీ బీఎన్ గరుడాచార్ కన్నుమూత

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిటైర్డ్ డీజీపీ బీఎన్ గరుడాచార్ (96) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయనకు చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్‌తోపాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వయోభారం ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆయన తుదిశ్వాస వీడారు. బసవనగుడి కృష్ణారోడ్డులోని నివాసం వద్ద అభిమానులు, బంధువుల సందర్శనకు ఏర్పాట్లు చేశారు. మండ్య జిల్లా నాగమంగల తాలూకా బిండిగేనహళ్ళి గ్రామానికి చెందిన గరుడాచార్ పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు జిల్లాల ఎస్పీగాను వ్యవహరించారు. బెంగళూరు జిల్లా ఎస్పీగా, బెంగళూరు నగర డీసీపీగా ఎనిమిదేళ్లపాటు, నగర పోలీస్ కమిషనర్‌గా నాలుగేళ్లు, డీజీపీగా మూడేళ్ల ఎనిమిది నెలలు పనిచేశారు. కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడుగాను వ్యవహరించారు. శనివారం సాయంత్రం విల్సన్‌గార్డెన్‌లోని స్మశానవాటికలో అంత్యక్రియలు జరుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



బీఎన్ గరుడాచార్ (ఫైల్)

కేంద్రమంత్రి కుమారస్వామికి సుప్రీంలో చుక్కెదురు

- భూ ఆక్రమణల వివాదంలో స్టే ఇచ్చేందుకు నిరాకరణ

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణల వివాదంలో ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రామనగర జిల్లా బిడది తాలూకా కేతమారనహళ్ళిలో భూ ఆక్రమణలకు పాల్పడ్డారని రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే జరిపి అటవీశాఖ పరిధికి చెందిన భూమిని గుర్తించారు. 2014లో సర్వే నెంబరు 8లో భూమి ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈమేరకు లోకాయుక్త అధికారులు ఆక్రమణలకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయితే స్థానిక అధికారులు చర్యలకు వెనుకడుగు వేశారు. అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా విచారణ జరిపిన ధర్మాసనం వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలకు స్టే ఇవ్వాలని కుమారస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం ఆక్రమణలను తొలగించాల్సిందేనంటూ సూచించింది. దీంతో కేంద్రమంత్రికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది.

పార్టీ బలోపేతానికే అగ్రనేతల సభ



ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నాయకులతో డీసీఎం డీకే శివకుమార్

- ఢిల్లీలో డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అగ్రనేతలు జిల్లా అధ్యక్షులతో సభ జరిపారని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో శుక్రవారం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం కంటే పార్టీ ముఖ్యమని, అందుకే అధిష్ఠానం జిల్లాఅధ్యక్షుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వారి ద్వారా పార్టీని శక్తివంతం చేసేందుకు సభ జరిపారన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా పలువురు పాల్గొన్నారన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంలో మీ అభిప్రాయాలు తీసుకున్నారా అని అడిగారన్నారు. సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా, సోషల్‌మీడియా పరిణామాలు, పార్టీకి విరాళాలు వంటి అన్ని అంశాలపైనా చర్చలు జరిగాయన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల పర్యటనలో కాంగ్రెస్ కార్యాలయానికి వస్తున్నారా, పార్టీకి సంబంధించి మీతో చర్చిస్తున్నారా... కార్యకర్తల కష్టాలు అడిగి తెలుసుకుంటున్నారా అని చర్చించారన్నారు. పార్టీని జిల్లాస్థాయి నుంచి బలోపేతం చేయాలనే పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

బెంగళూరులో బీజేపీ రెబల్స్ భేటీ

- యత్నాళ్ అంశంపైనే చర్చ..

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై పార్టీ అధిష్ఠానం ఆరేళ్ల వేటుతోపాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించిన మేరకు రెబెల్స్ నేతలు భేటీ అయ్యారు. శుక్రవారం బెంగళూరు యూబీ సిటీలోని కేంద్రమాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్ నివాసంలో యత్నాళ్ బృందం కలిశారు. క్రమశిక్షణా చర్యలలో భాగంగా వేటు వేశారని పార్టీ ప్రకటించింది. తదుపరి చర్యలపై కీలకంగా చర్చించారు. ఎమ్మెల్యే రమేశ్‌జార్కిహొళి, బీపీ హరీశ్, కుమారబంగారప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే బీపీ హరీశ్‌కు షోకాజ్ నోటీసు జారీ అయిన విషయం తెలిసిందే. సభలో తీర్మానాలను రహస్యంగా ఉంచారు. అయితే యత్నాళ్‌కు మద్దతుగా లింగాయత ఎమ్మెల్యేలందరూ బీజేపీ నుంచి బయటకు రావాలని బసవ మృత్యుంజయస్వామీజీ పిలుపుపై ఎమ్మెల్యే బండెప్పకాశంపూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్వామీజీ పిలుపు ఇస్తానే రాజీనామా చేయాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బసవమృత్యుంజయ స్వామీజీ వ్యాఖ్యలకు భిన్నంగా బసవకల్యాణ తాలూకా బేళూరు విరక్తమఠ శివకుమారస్వామిజీ స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ యత్నాళ్‌పై వేటు సంతోషం కలిగిందన్నారు. యడియూరప్ప, విజయేంద్ర, బసవణ్ణల గురించి కూడా అనుచితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. బసవమృత్యుంజయస్వామీజీ తనకు ఆప్తుడేనని, అయితే ఒక వ్యక్తికోసం మాట్లాడడం సరికాదన్నారు. స్వామిజీగా పిలిపించుకునేవారు సమానంగా ఉండాలన్నారు. మాజీ మంత్రి మురుగేశ్‌నిరాణి, విజయానంద కాశప్పనవర్‌లను దూషించినప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. కాగా విజయపుర జిల్లాలో బీజేపీలోని పలువర్గాలు రాజీనామాలకు సిద్ధమయ్యాయి. విజయపుర నగర పార్టీలోని వివిధ కేడర్‌లకు చెందినవారు, మోర్చాల ప్రతినిధులు 174మంది పార్టీలకు రాజీనామా చేశారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



విధానసౌధకు నూతన సొబగులు

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాలనాకేంద్రమైన విధానసౌధకు కొత్త సొబగులు అందించారు. ఇటీవలే నూతన విద్యుద్దీపాలను అమర్చగా శుక్రవారం శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవురోజులలో విద్యుత్ దీపాలతో విధానసౌధ విరాజిల్లనుంది. సందర్శకులను మరింత కనువిందు చేయనుంది.

మహారాష్ట్ర బ్యాంక్‌లో భారీ కుంభకోణం..!

- రూ.10 కోట్లకు మేనేజర్ టోపీ..!
- బ్యాంక్ ఆడిట్‌లో బట్టబయలవడంతో పరార్..!

6



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.48 (శనివారం సాయంత్రం)

సెహరీ : 5.05 (ఆదివారం ఉదయం)

ఎండ పొడ ఏమాత్రం తగలని జీవితం. పని అంతా నీడ పట్టునే. టేప్ రికార్డర్‌లో వినసొంపైన పాటలు వింటూ.. పోగులను అందమైన చీరలుగా తయారు చేస్తూ హాయిగా కాలం గడిపే నేతన్నను చూసి ఇది కదా జీవితం అంటే అని ఎండలో పని చేసే కష్టజీవులు కాస్త అసూయ పడేవారు. ఇదంతా గతం. పెరిగిన టెక్నాలజీ వల్ల చేతి మగ్గాలు కనుమరుగయ్యాయి. మొత్తం మరమగ్గాల మయం అయిపోయింది. ఒకప్పుడు చేనేత మగ్గాలతో కళకళలాడిన ఇళ్లు, ఊళ్లు నేడు వెలవెల బోతున్నాయి. కుటుంబ పోషణ భారమై చేనేతలు ఇతర వృత్తుల్లోకి మారారు. ఆకోవకు చెందిన వ్యక్తే సోమందేపల్లిలోని మణికంఠ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు నాగరాజు.



మజ్జిగ అమ్ముకుంటున్న నేతన్న నాగరాజు

పోగు బంధం తెంచుకుని..

● ఒకప్పుడు నాలుగు మగ్గాలతో బాగా బతికి.. ● నేడు మజ్జిగ అమ్ముకుంటూ జీవనం

నాగరాజు ఒకప్పుడు బాగా బతికాడు. నాలుగు మగ్గాలు ఏర్పాటు చేసుకుని నలుగురికి ఉపాధి కల్పించాడు. ప్రస్తుతం అప్పులపాలై తాను దర్జాగా బతికిన ఊరిలో సైకిల్‌పై వీధి వీధి తిరిగి మజ్జిగ అమ్ము కుంటున్నాడు. ఆయన్ను కదిలిస్తే తన కడుపుమండిన కష్టాలను వివరించారు. తొమ్మిదేళ్ల కిందట మగ్గాల కోసం ఇల్లు

పువ్వులమ్మిన చోటే..

బాడుగకు తీసుకుని నాలుగు చేతిమగ్గాలు ఏర్పాటు చేసుకున్నానన్నారు. నలుగురికి పని కల్పిస్తూ ముడిసరుకులను మాస్టర్‌వీవర్స్ వద్ద తెచ్చుకుని ఒక్కో మగ్గంపై వారానికి ఒకటి రెండు చీరలు తయారీ చేయించేవాడినన్నారు. నాలుగు మగ్గాలలో నేసిన చీరలను ఒక్కొదానికి మాస్టర్ వీవర్స్ వెయ్యి చొప్పున ఇచ్చేవారన్నారు. అం దులో ఖర్చులన్నీ పోను చీరపై రూ.300 మిగిలేదన్నారు. ఇలా వారానికి రూ.2వేల నుంచి రూ.3వేలు సంపాదించే వాడినని తెలిపారు. తరువాత కాలంలో చేతిమగ్గాలు వైభవం కోల్పోవ డంతో గిట్టుబాటు ధర లేక మగ్గాలు అమ్మేసి సెక్యూరిటీ గార్డ్‌గా బెంగళూరులో మూడేళ్లపాటు జీవనం సాగించినట్లు తెలిపారు.

కుమారుడి అనారోగ్యంతో సొంతూరికి..

పెద్దకుమారుడికి ఆరోగ్యం సరిగా ఉండకపోవడంతో ఉద్యోగం వదిలి స్వగ్రామానికి వచ్చినట్లు వెల్లడించాడు. అనంతరం రెండేళ్ల బేల్దారి పనులు చేశానన్నారు. కరోనా వ్యాధి ప్రబలడం, తనకు ఆరోగ్యం క్షీణించ డంతో రూ.2లక్షలు దాకా ఖర్చుచేసి బతికి బయటపడ్డానన్నారు. ప్రస్తుతం కూలి పనులు చేతకక మజ్జిగ అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5లక్షలు అప్పులున్నాయన్నారు. సొంత ఇల్లు కూడా లేక బాడుగ ఇంటిలో నివాసముంటున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా మజ్జిగ అమ్మితే రోజూ రూ.200 గిట్టుబాటు అవుతుందన్నారు. తనకు భార్య అంజినమ్మ, కుమారులు ఆదినారాయణ, ఓబుళరాజు, నరసింహ ఉన్నారు. వీరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా చాలీచాలని సంపాదనతో తాను సంసారాన్ని ఈడుస్తున్నట్లు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, సోమందేపల్లి



కుటుంబ సభ్యులతో చేనేత నాగరాజు

మయ్యాయో ఏమో..!

కరోనా పేరు వింటేనే ఇప్పటికీ జనం బెంబేలెత్తిపోతారు. ఆ సమయంలో అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందించడానికి ప్రభుత్వం ఇబ్బంది పడింది. అలాంటి సమయంలో మేమున్నామంటూ మానవతా మూర్తులు, దాతలు ముందుకొచ్చి వైద్య పరికరాలు, యంత్రాలు విరాళంగా ఇచ్చారు. అందులో భాగంగా జిల్లాలో అనేక మంది పరిశ్రమల యాజమానులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, ఎన్ఆర్ఐలు ముందుకొచ్చి ఈ యంత్రాలను అందజేశారు. అలాంటి యంత్రాలను ఎంతో బాధ్యతగా దాచిపెట్టుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో కరోనా వైద్యపరికరాలు ఉన్నాయా..? ఉంటే ఎక్కడ ఉన్నాయో కూడా వైద్యాధికారులకు తెలియదంటే.. వైద్యాశాఖల పనితీరు ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.

కనిపించని కొవిడ్ వైద్య పరికరాలు

అప్పట్లో వేలాది మంది దాతల సహకారం

సమాచారం చెప్పలేనిస్థితిలో వైద్యాధికారులు

అనంతపురం టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో బాధితులకు అత్యవసరంగా చికిత్సలు అందించడానికి దాతలు అవసరమైన వైద్యపరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసి వైద్యశాఖలకు అందజేశారు. అధికారుల రికార్డుల ఆధారంగా 8,341 వైద్య పరికరాలు అందించారు. అందులో ముఖ్యంగా.. బీఐ పీఏపీ అండ్ వీ-పీఏపీ 73, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ (5ఎల్) 725, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్(10ఎల్) 30, సీ-పీఏపీ 5, ఈసీజీ యంత్రాలు 5, డెఫిబ్రిలియేటర్స్3, మల్టిపారమానిటర్స్ 20, ఐఆర్ థర్మామీటర్స్ 2196, ఫింగర్‌ట్రిప్ పల్స్ ఆక్సీమీటర్స్ 2,950, హ్యాండ్‌హెల్డ్ పల్స్ ఆక్సీమీటర్స్ 82, సిరంజ్ పంప్స్ 40, సక్షన్ అపార్టస్ 20, ఆక్సిజన్ సిలిండర్స్ 1666, ఆక్సిజన్ ఫ్లోమీటర్స్ 500, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్స్ 5, సీ-పీఏపీ పీడియాట్రిక్స్ 10, వీడియో బ్రాంకోస్కోప్ మానిటర్స్ 6, ఎక్స్‌రే100ఎంఏ, వీడియో లార్యాంగోస్కోప్ ఒక్కొక్కటి, డిస్పోజబుల్ బ్లేడ్స్ 5 కరోనా సమయంలో దాతలు అందించారు. ఈ యంత్రాలను జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్, సీహెచ్‌సీలలో ఏర్పాటు చేసిన కొవిడ్ చికిత్స సెంటర్లకు అందజేశారు. మరోవైపు తాడిపత్రి, సూపర్‌స్పెషాలిటీలో జర్మనీషెడ్లు ఏర్పాటుచేసి కరోనా బాధితులకు చికిత్సలు అందించారు. అక్కడ కూడా మెగా కంపెనీ నుంచి కోట్లు విలువచేసే వైద్యపరికరాలు విరాళంగా అందజేసింది. ఆ పరికరాలు ఉన్నాయా లేదా మాయమై పోయాయా అనేది అర్థంకావడంలేదు. ఆయా వైద్యశాఖల అధికారులు సైతం వీటి గురించి అడిగితే ఏదో సమాచారం చెప్పి తప్పించుకుంటున్నారు.



జిల్లా ఆసుపత్రిలోని గోదాములో అట్టపెట్టెలో నిల్వ ఉంచిన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్

మాకు సంబంధం లేదు



కరోనా సమయంలో ఇచ్చిన వైద్య పరికరాల గురించి మాకు సంబంధంలేదు, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌లకు మాత్రమే వాటిని అందజేశారు. అవి ఏమిటో కూడా మాకు తెలియదు. ఒక వేళ సమాచారం తెలుసుకొని చెప్పమంటే చెబుతా.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

దొరికిన వాటిని దాచిపెట్టాం

నేను వచ్చిన తర్వాత పంగల్‌రోడ్డు నందుగల డీఆర్‌డీఏ శాఖకు చెందిన సమావేశ మందిరంలో ఎన్నికల డ్యూటీ వేశారు. ఆ సమయంలో అక్కడికి వెళితే కరోనాకు వినియోగించిన వైద్యపరికరాలు ఉన్నాయని తెలిసింది. వాటిని తీసుకొచ్చి పాతూరు సీడీ ఆసుపత్రిలో దాచి ఉంచాం. మిగిలిన పూర్తీ సమాచారం తెలియాలంటే డీఎంహెచ్ఓ కార్యాలయం వాళ్లనే అడగాలి.



- డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్‌ను వాడుతున్నాం



కరోనా సమయంలో దాతలు వివిధ రకాల వైద్యపరికరాలు ఇచ్చిన విషయం వాస్తవమే. అందులో ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్స్‌ను ఆసుపత్రి గోడౌన్‌లో ఉంచాం. రోగులకు అవసరమైనపుడు వాటిని వినియోగిస్తున్నాం. మిగిలినవాటి గురించి నాకు పూర్తిగా తెలియదు.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యోగా అవార్డులకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. యోగా ప్రచారం, యోగా అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు, జాతీయ వ్యక్తి, జాతీయ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల విభాగాలవారీగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు కనీసం 20 ఏళ్లుగా యోగా సేవలో ఉంటూ, వయస్సు 40ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబరు 08554-315632లో సంప్రదించాలని కోరారు. వెబ్‌సైట్@http:///innovateindia.mygov.in/pm-yoga-awards-2025

భద్రం బాబూ..



తీగ చింత తినేందుకు రుచిగానే ఉండొచ్చు..! పట్టు తప్పితే.. పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించు..!

(అనంతపురం నగర శివారులోని హెచ్చెల్సీ పైప్ లైన్ మీద నిలబడి తీగ చింతకాయలు కోసేందుకు చిన్నారుల పాట్లు.. పీట్లు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



తీగ చింత కాయలు

తెలంగాణ ప్రజలకు మంచి దర్శనం చేయిస్తున్నారు

● చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకుని టీటీడీ మంచి దర్శనం చేయిస్తోందని ఆ రాష్ట్ర శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై ఈనెల 24వ తేదీ నుంచి దర్శనం కల్పిస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు కూడా చాలా ఆనందంగా ఉన్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఇంకా అభివృద్ధి చెందాలని, స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్టు చెప్పారు.

6న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

● 7న శ్రీరామ పట్టాభిషేకం

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహనంపై శ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఇక, 7వ తేది రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కాగా, ఏప్రిల్ నెలలో 10 నుంచి 12వ తేదీ వరకు వసంతోత్సవాలు, 12న పౌర్ణమి గరుడసేవ, తుంబురతీర్థ ముక్కోటి, 23న భాష్యకార్ల ఉత్సవం, 30న అక్షయతృతీయ వంటి పర్వదినాలనూ నిర్వహించనున్నారు.

మందుగుండుకు పాడి ఆవు బలి

పుట్టపర్తి రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అమగొండపాలెం పొలాల్లో అడవి పందుల వేట కోసం ఉంచిన మందుగుండు పేలి ఓ పాడి ఆవు శుక్రవారం మరణించింది. అడవి పందుల కోసం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు జామపండులో మందుగుండ పెట్టి ఉంచారు. వీరజిన్నయ్యపల్లి రైతు ఇడగుట్టు చిన్నప్పకు చెం దిన పాడి ఆవు దాన్ని శుక్రవారం దాన్ని కొరకడంతో.. మందుగుండు పేలి.. దవడ చిట్టిపోయింది.ఇంటికి చేరిన ఆ ఆవు.. కొద్దిసేపటికే మరణించింది.

చట్టాలపై అవగాహన

బుక్కపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీకాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ షీబ్బుద్దీన్ ప్రజలకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, వీఆర్ఓ సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విచారణతో వణుకు..!

ఆడుదాం.. ఆంధ్రాలో అడ్డగోలుగా అవినీతి



నాసిరకంగా ఉన్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ సామగ్రి

రూ.లక్షలు స్వాహా

అప్పటి డీఎస్ఏ చీఫ్ కోచ్‌పై ఆరోపణలు

ఏసీబీ ఎంక్వైరీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం

అక్రమార్కుల గుండెల్లో రైళ్లు



నార్పల స్టేడియంలో ఓ గదిలో ఉంచిన ఆడుదాం ఆంధ్రా కిట్లు



నాసిరకంగా ఆడుదాం ఆంధ్రా బ్యాడ్మింటన్ ర్యాకెట్లు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆడుదాం ఆంధ్రా పేరుతో నిర్వహించిన క్రీడాపోటీలు.. అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. అవినీతి, పార్టీ ప్రచారానికే పోటీలు నిర్వహించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దోపిడీయే లక్ష్యంగా ప్రక్రియ సాగించారు. క్రీడాకారులకు నీరు కూడా ఇవ్వకున్నా.. ఏకంగా భోజనాలు పెట్టినట్లు బిల్లులు కాజేశారు. అత్యంత నాసిరకం క్రీడా కిట్లతో నిధులు దిగమింగారు. ప్రైజ్‌మనీ అన్నింటా అక్రమాలే. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు వేసిన ఈ స్టంట్‌లో అడ్డగోలుగా దోచుకుతిన్నారు. ఈ వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆడుదాం ఆంధ్రా నిర్వహణలో ఏసీబీ విచారణకు ఆదేశించడంతో అప్పట్లో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వారిలో వణుకు మొదలైంది.

సొంత ప్రచారం

గత వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లపాటు క్రీడాభివృద్ధిని గాలికొదిలేసింది. ఎన్నికలకు ముందు 'ఆడుదాం.. ఆంధ్రా' అంటూ యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది. టీ షర్టులతో మొదలు వైసీపీ రంగులు, జగన్ బొమ్మలతో సొంత ప్రచారం చేసుకుంది. నాసిరకంగా కిట్లు, ఈవెంట్ నిర్వహణ నిర్వీర్యం, ముగింపు పోటీలు, ప్రైజ్‌మనీ ఇలా అన్నింటా నిధులు భారీగా దుర్వినియోగం చేశారు. అప్పటి డీఎస్‌డీఓ జేబులు ఫుల్లుగా నింపుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

సగం స్వాహా...

ఆడుదాం.. ఆంధ్రా పోటీల నిర్వహణకు జిల్లాకు రూ.1.20 కోట్లు కేటాయించారు. అప్పట్లో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) చీఫ్ కోచ్‌గా పనిచేసిన నరసింహారెడ్డి అందులో సగం రూ.60లక్షల వరకు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలు బయటపడకముందే అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండదండలతో విజయవాడకు బదిలీ చేయించుకుని వెళ్లారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వహణ, నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. నిధులు స్వాహాలో డీఎస్‌డీఓతోపాటు ఎవరెవరి పాత్ర ఉంది, అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉందా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏసీబీ విచారణలో భారీఎత్తున అక్రమాలు వెలుగుచూసే అవకాశాలున్నాయన్న చర్చ సాగుతోంది. గుంటూరు జిల్లా డీఎస్‌డీఓగా బదిలీపై వెళ్లిన తరువాత ఆయన సుమారు పదిసార్లు జిల్లాకు రహస్యంగా వచ్చి వెళ్లినట్లు సమాచారం. అక్రమాలు బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసుకోవడానికే వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది.

సామగ్రిని నిల్వ ఉంచాం



విచారణకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ప్రస్తుతానికి సమాచారం లేదు. ఆడుదాం ఆంధ్రా పోటీలకు తెప్పించిన క్రీడాసామగ్రిని నిల్వ ఉంచాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ

ఎస్సీ సబ్సిడీ రుణాలపై కసరత్తు



ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాధిక

ఎస్సీ సబ్సిడీ రుణాలపై కసరత్తు ప్రారంభించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు (డీడీ), ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కూడా అయిన రాధిక చెబుతున్నారు. సంక్షేమ వసతిగృహాల్లో వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్‌ను సమన్వయంతో నడిపిస్తూ ఎస్సీ వర్గాలకు పథకాలను చేరువ చేయడమే లక్ష్యం అంటున్న ఆమెతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: పదో తరగతి పరీక్షలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: ఏఎస్‌డబ్ల్యూఓలు, వార్డెన్లు రాత్రివేళల్లో హాస్టళ్లలో బస చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఈసారి పదో తరగతి ఫలితాల్లో ఎస్సీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులందరూ పాసయ్యేలా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: హాస్టళ్లలో వసతులెలా ఉన్నాయి..?

జవాబు: జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులు చేపడుతున్నాం. తాజాగా ప్రతి హాస్టల్‌కు వంట సామగ్రి పంపిణీ చేశాం. విద్యార్థులకు దుప్పట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశాం.

ప్రశ్న: ఎస్సీ కార్పొరేషన్‌లో రికవరీలు ఎలా సాగుతున్నాయి..?

జవాబు: ఎస్సీ కార్పొరేషన్‌లో 2014-19 మధ్య కాలంలో అమలైన పథకాలకు సంబంధించి రికవరీల విషయంలో రాజీపడటం లేదు. ఇప్పటికే ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌ఎస్ఎఫ్‌డీసీ పథకాల కింద లబ్ధిపొందిన వారి నుంచి రికవరీలకు క్షేత్రస్థాయిలో అధికారులను పంపుతున్నాం. రికవరీలు చేస్తున్నాం.

ప్రశ్న: ఎస్సీ సబ్సిడీ రుణాల పరిస్థితేంటి?


జవాబు: ఎస్సీ కార్పొరేషన్‌లో ఈ ఏడాదికి సంబంధించి సబ్సిడీ రుణాల ప్రక్రియపై కసరత్తు సాగుతోంది. యూనిట్ల వారీగా రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే సబ్సిడీ రుణాలకు సంబంధించిన విధివిధానాలు ప్రకటిస్తాం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఉత్పల్ దత్ (జయంతి)



ఉత్పల్‌దత్ 1929 మార్చి 29న బరిసల్ ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఉంది) జన్మించారు. బెంగాలీ నాటక రంగం నుంచి సినీ నటుడిగా, దర్శ కుడిగా, రచయితగా పేరొందారు. 40 ఏళ్లలో వందకుపైగా బెంగాలీ, హిందీ సినిమాలలో నటించారు. భువన్ షోమ్, ఆగంతక్, గోల్‌మాల్, రంగ్ బిరంగి వంటి సినిమాలు ఎంతో గుర్తింపుని చ్చాయి. జాతీయస్థాయిలో ఉత్తమ నటుడి పుర స్కారం, మూడుసార్లు ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ కమెడియన్ అవార్డులు, సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. 1993 ఆగస్టు 19న కన్నుమూశారు. 2013లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

కేవైఎస్ పతంజలి (జయంతి)



కాకర్లపూడి యోగ నారసింహ పతంజలి 1952 మార్చి 29న విశాఖపట్నంలో జన్మించారు. తెలుగు రచయిత, కవి, పత్రికా సంపాదకుడు, ఆయుర్వేద వైద్యుడి బహుముఖ ప్రజ్ఞాశాలి. తండ్రి వారసత్వంతో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. 11వ యేట 1963లో 'అస్థిపంజరం' అనే అపరాధ పరిశోధక నవల రాశారు. పలు కథలు, సీరియల్స్ దినపత్రికలలో ప్రచురితమయ్యాయి. రావిశాస్త్రి రచన పురస్కారం, చాసో స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'సింధూరం' సినిమాకు ఉత్తమ మాటల రచయితగా 'బంగారు నంది అవార్డు' దక్కింది. 2009 మార్చి 11న కన్నుమూశారు.

అదితి అశోక్ (పుట్టినరోజు)



ప్రొఫెషనల్ గోల్ఫ్ క్రీడాకారిణి, 'అర్జున' అవార్డు గ్రహీత అదితి అశోక్ 1998 మార్చి 29న బెంగళూరులో జన్మించారు. 2013లో ఏషియన్ యూత్ గేమ్స్‌లో ఇండియా నుంచి పాల్గొన్న ఏకైక క్రీడాకారిణి. 2016లో రియో సమ్మర్ ఒలింపిక్స్‌లో దేశం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2016 సీజన్‌లో లేడీస్ యూరోపియన్ టూర్‌లో పాల్గొన్నారు. హీరో ఉమెన్స్ ఇండియన్ ఓపెన్‌లో సత్తా చాటుకున్నారు. రూకీ ఆఫ్ ది ఇయర్ అవార్డు, ఇతర ట్రోఫీలు సాధించారు. 2020 సమ్మర్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొని వరల్డ్‌లో 200వ ర్యాంకులో నిలిచారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముళబాగిలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి పాఠశాల ఐసీఎస్ఈ సిలబస్‌లో ఎస్ఎస్ఎల్‌సీలో 16ఏళ్లుగా క్రమం తప్పకుండా వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో కోలారు జిల్లాలో గుణాత్మక విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని పాఠశాల అధ్యక్షుడు చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని జ్ఞానజ్యోతి పాఠశాలలో కార్నివాల్ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందిస్తున్నారని ఇక్కడి విద్యార్థులు ప్రతిభావంతులు అయ్యేందుకు సాధ్యమైందన్నారు. పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పాఠశాల ప్రారంభమై 22ఏళ్లు అయ్యిందని వేలాదిమంది విద్యార్థులు ఉన్నత హోదాలలో ఉన్నారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యా ర్థుల వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పా ఠశాల కార్యదర్శి అర్జున్ శ్రేయస్, ప్రిన్సిపాల్ మంజుళ చంద్రు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



ర్యాంప్‌వాక్‌లో ఇలా...

మహదేవపుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రతి రంగంలోనూ అభివృద్ధి సాధించాలని రాఘవి చారిటబుల్ ట్రస్టు సేవా అండ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర సుంట్రళ్ళి అభిప్రాయపడ్డారు. వైట్‌ఫీల్డ్ విభాగం పోలీసుల సహకారంతో గరుడాచార్ పాళ్యలోని ప్రైవేట్ కళ్యాణమండపంలో మహిళల సాంస్కృతిక ఫ్యాషన్ ర్యాంప్‌వాక్, ఉమెన్స్ అచీవర్ అవార్డ్స్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు శాఖలో సేవలందిస్తున్న మహిళా సిబ్బందికి, ఇతర రంగాల సాధకులకు 18మందికి అవార్డులతో సత్కరించారు. వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ శివకుమార్, ఏసీపీ రీనా సువర్ణ, ప్రియదర్శిని మహిళా అధికారి రేణుకా, కేఆర్‌పుర పోలీస్‌స్టేషన్ ఎస్సై అనితాలు పాల్గొనగా పోటీలకు న్యాయనిర్ణేతగా నళినా జయచంద్ర, డాక్టర్ శ్వేతజకా, విద్యా, పూజా తదితరులు పాల్గొన్నారు.

సంతలో జోరుగా గొర్రెల విక్రయాలు



సంతలో గొర్రెలు

బంగారపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలు ఒకేసారి వస్తుండడంతో పట్టణంలో శుక్రవారం జరిగిన సంతలో గొర్రెలు, మేకలు, కోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. నూతన సంవత్సరాది ఉగాది ఆదివారం, మరుసటి రోజు ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ రానున్నాయి. పండుగ మరుసటి రోజు హొసతడకు పేరిట మాంసాహార విందును ఆనవాయితీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో గొర్రెలు, మేకలు, కోళ్ల కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపారు. ఒక్కో గొర్రె కనీసంగా రూ.40వేల వరకు ధర పలికిందని వీ కోటకు చెందిన గొర్రెల వ్యాపారి వెంకటేశ్ తెలిపారు.

భారతశక్తి ప్రపంచానికి చాటేందుకు యువతే కీలకం

›› స్నాతకోత్సవంలో గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ పిలుపు



పట్టాల ప్రదానంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారతశక్తి ప్రపంచానికి చాటేందుకు యువతే కీలకమని గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ అభిప్రాయ పడ్డారు. సీఎంఆర్ యూనివర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. 2188 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయగా 34మందికి బంగారు బహుమతులను, 24మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ గుణాత్మక విద్యద్వారా ప్రపంచంలో భారతీయ విద్యార్థులు రాణిస్తున్నారని కొనియాడారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ దేశం సదృఢంగా మాట్లాడేందుకు యువ విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. ఉన్నత విద్యతోపాటు మానవతా విలువలు పాటించాలని సూచించారు. సీఎంఆర్ సంస్థల చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ కేసీ రామమూర్తి, కులాధిపతి డాక్టర్ సబితా రామమూర్తి విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ హెచ్‌డీ రాఘవేంద్ర, సీఎంఆర్ జ్ఞానధార ట్రస్టు కార్యదర్శి కేసీ జగన్నాథరెడ్డి, కేఆర్ జయదీప్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలి

›› మంత్రికి ఎమ్మెల్యే రవికుమార్ వినతి



మేలూరు గ్రామంలో కల్యాణమండపానికి భూమిపూజ చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 224 నియోజకవర్గాలపైకి వెనుకబడిన శిడ్లఘట్ట అభివృద్ధికి మరింత సహకారం ఇవ్వాలని మంత్రి మునియప్పకు ఎమ్మెల్యే రవి కుమార్ కోరారు. తాలూకాలోని మేలూరు గ్రామంలో గంగాదేవి కల్యాణమండపం నిర్మాణానికి పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప, నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్‌తో కలసి శ్రీకారం చుట్టారు. మేలూరు గ్రామదేవత గంగాదేవి దేవాలయం, చన్నకేశవస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. రెండోఅంతస్థు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 2028 నాటికి రిజర్వు నియోజకవర్గంగా మారే అవకాశం ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. అలాగే మీరు చదివిన పాఠశాల ఆధునీకరణకు గ్రాంట్లు ఇవ్వాలని మంత్రిని కోరారు. మంత్రి మునియప్ప మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ఊరికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని మేలూరులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశానని జ్ఞాపకం చేసుకున్నారు. విద్య నేర్పిన గురువులను, సహకరించిన గ్రామపెద్దలను గుర్తు చేసుకున్నారు. గంగాదేవి ఆలయ నూతన కల్యాణమండపం నిర్మాణానికి ఇన్ఫోసిస్‌లో పనిచేసే కొంతమంది ఆర్థిక సాయం చేశారన్నారు. నిర్మాణ పనులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. కార్య క్రమంలో గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఆర్‌పి ఉమేశ్, కేఎస్ మంజు నాథ్, పీడీఓ కేవీ శారదా, ప్రముఖులు జేజీగౌడ, రామకృష్ణప్ప, హెచ్‌టీ రామాంజినప్ప, వీ కెంప య్య, మంజునాథ్, మూర్తి స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో రైతుల వాగ్వాదం



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

చింతామణి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార హోబళి మస్తేనహళ్ళి పారిశ్రామికవాడలో కేఐఏడీబీ అధికారులు శుక్రవారం భూస్వాధీనానికి సిద్ధం కాగా రోడ్డుపై వచ్చే మామిడిచెట్లకు నగదు చెల్లించాకనే స్వాధీనం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చింతామణి రూరల్ పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. సర్వే 89లో మామిడిచెట్లను పొక్లైనర్‌లతో తొలగించాలని అధికారులు సిద్ధం కాగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తొలుత చెట్లకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశాకనే ప్రక్రియ చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. భూస్వాధీన అధికారి హరీశ్ శిల్పా మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వచ్చామన్నారు. సర్వే 87లో భూస్వాధీన ప్రక్రియ ముగిసిందని, సర్వే 89లో చేపట్టామన్నారు. స్వాధీనం చేసుకునే భూమికి ప్రత్యామ్నాయ భూమి కోరారని అందుకు వినతిపత్రం ఇవ్వాలని కోరారు. పారిశ్రామికవాడలో నీరు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పథకాలు సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి అధికారి ఆదర్శ, ఏఈఈ శ్వేతా, చింతామణి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బెన్సన్‌టౌన్‌లోని ఓ మసీదుకు అలంకరణ



శివాజీనగర్ అశోకహోటల్ కూడలిలో రద్దీ ఇలా..

శివాజీ నగర్‌లో రంజాన్ సందడి

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సమీపిస్తున్న తరుణంలో శివాజీ నగర్ ప్రాంతం సందడిగా మారింది. పండుగకు కొత్త దుస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. నెలరోజుల ఉపవాసాల వేళ శివాజి నగర్‌లో ఉపవాసదీక్షలు చేసేవారికి అవసరమైన ఆహార పదార్థాలు ప్రత్యేకంగా విక్రయించడం సాధారణమే. పండుగ సమీపిస్తున్న తరుణంలో సేమియా, ఖర్జూరం, మసాలా దినుసులు, ఇతర పదార్థాల కొనుగోలుకు రెండు రోజులనుంచి పెద్ద ఎత్తున ప్రజలు శివాజీ నగర్‌కు వస్తున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా మార్కెట్ సాగుతున్నాయి. కమర్షియల్ స్ట్రీట్‌ను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. బెన్సన్‌టౌన్, ఫ్రేజర్‌టౌన్ ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి.



కమర్షియల్ స్ట్రీట్‌లో అలంకరణ



శివాజీ నగర్‌లో సేమియా అమ్మకాలు

ఇంజనీర్ల ఆలోచనలకు వేదిక ఈఎఫ్ఎక్స్



సదస్సులో వివిధసంస్థల ప్రముఖులు

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సామర్థ్యం సుస్థిర ఆవిష్కరణలో పేరొందిన అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ సేవా సంస్థ ఏఎస్ఎంఈ ఫౌండేషన్ ఇండియా జరిపిన ఇఎఫ్ఎక్స్ ఇండియా 2025 ఇంజనీర్ల ఆలోచనలకు వేదికగా మారిందని బోయింగ్ ఇండియా ఈడీ మారియాకాడ్వర్ల్ అభిప్రాయపడ్డారు. రేవా యూనివర్సిటీ సహకారంతో మూడు రోజుల సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా 700కుపైగా ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. మారియాకాడ్వర్ల్ మాట్లాడుతూ డిమాండ్‌లు అపారంగా ఉన్నాయని యువ ఇంజనీర్లు వారి కలలను సాకారం చేసుకునేందుకు సాంకేతిక నైపుణ్యత కీలకం కానుందన్నారు. గడిచిన ఏడు సంవత్సరాలలో ఐఎఫ్ఎక్స్ 20 నగరాలలో 400 శిక్షణా సంస్థలనుంచి 10వేలమందికిపైగా ఇంజనీరింగ్ విద్యార్థులకు తమ అభిప్రాయాలను పంచుకునే వేదిక చేసిందన్నారు. బయో మిమిక్రీ, జీడీ అండ్ టీఎస్ ఇంజనీరింగ్, రిమోట్ ఇమేజ్ ఫర్ మెటీరియల్ అసెస్‌మెంట్, సుస్థిర ఇంజనీరింగ్ వంటి అత్యాధునిక అంశాలపై వక్తలు మాట్లాడారు. ఏఎస్ఎంఈ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ చైర్మన్ మధుకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. రేవా యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పీ శ్యామరాజు విద్యార్థులకు పారిశ్రామిక నైపుణ్యత మనస్తత్వాన్ని పెంచుకునే అంశంపై వివరించారు.

విద్యార్థులు కొత్త ఐడియాలతో ముందుకెళ్లాలి

›› ఒరాకిల్ సంస్థ ముఖ్యులు శ్రీధర్ నారాయణస్వామి పిలుపు

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతికపరంగా కొత్త ఐడియాలతో ముందుకెళ్లాలని ఒరాకిల్ సంస్థ ఆర్ అండ్ డీ ముఖ్యులు శ్రీధర్ నారాయణస్వామి పిలుపునిచ్చారు. యలహంకలోని బీఎంఎస్‌ఐటీలో జాతీయస్థాయి ఐడియాథాన్ పోటీలు జరిగాయి. లఖ్‌నవ్, పుణె, ఢిల్లీతోపాటు రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాల బృందాలు పాల్గొన్నాయి. 129 జట్లు భాగస్వామ్యం కాగా గ్రాండ్ ఫినాలెకు 56జట్లు చేరాయి. విజేతజట్టుకు 2.25 లక్షల రూపాయలు ప్రదానం చేశారు. ఎపిక్వార్ సీనియర్ డైరెక్టర్ రాజేశ్ బన్సాల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్, డీన్ సీమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఐడియాథాన్ పోటీల ప్రారంభోత్సవంలో శ్రీధర్‌నారాయణస్వామి

ప్రధాని ఆశీస్సులు పొందిన ఎంపీ తేజస్వీసూర్య దంపతులు

బెంగళూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలసి బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వీసూర్య దంపతులు శుక్రవారం ఆశీర్వాదం పొందారు. ఇటీవలే తేజస్వీసూర్య తమిళనాడుకు చెందిన నృత్యకళాకారిణి, గాయని శివశ్రీని వివాహం చేసుకున్నారు. ప్రధానమంత్రిని కలసి ఆశీస్సులు పొందారు. పెండ్లి ఫోటోలను ప్రధానమంత్రికి చూపినట్టు ఎంపీ 'ఎక్స్'లో రాసుకున్నారు. ఇదే సందర్భంగా 750 సంవత్సరాలనాటి మధ్వాచార్యుల మూలగ్రంథాన్ని ప్రధానికి బహూకరించారు.

ఎస్‌జేబీలో రక్తదాన శిబిరం



రక్తదాతను అభినందిస్తున్న ప్రకాశనాథ స్వామిజీ

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎస్‌జేబీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం 14వ రక్తదాన శిబిరం శుక్రవారం జరిగింది. ఎస్‌జేబీ సంస్థల ఎండీ ప్రకాశనాథస్వామిజీ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాశనాథస్వామిజీ మాట్లాడుతూ రక్తం ఉత్పత్తి చేసే అవకాశం లేదని అయితే అత్యవసరాలకు రక్తం ప్రాణాలు కాపాడుతుందన్నారు. యువత రక్తదానం ద్వారా మరొకరి ఆరోగ్యం కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. ఎస్‌జేబీ మెడికల్ కళాశాల, రోటరీ క్లబ్ దక్షిణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం సాగింది. బీజీఎస్ అకడమిక్ డైరెక్టర్ పుట్టరాజు, ప్రిన్సిపాల్ మహేంద్రప్రశాంత్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినే టర్ దొరెస్వామి తదితరులు పాల్గొన్నారు. 310 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

మంగళముఖిలకు ప్రత్యేక శౌచాలయం



శౌచాలయం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరికీ కనీస సౌలభ్యాలు అవసరమని రోటరీ సంస్థ ప్రత్యేకంగా మంగళముఖిలకోసం శౌచాలయం ఏర్పాటు చేయడం సంతోషమని ఆర్ఐ డైరెక్టర్ కేపీ నాగేశ్ అభిప్రాయపడ్డారు. మెజస్టిక్ ప్రాంతం ఉప్పారపేట పోలీస్‌స్టేషన్ సమీపాన రోటరీ ఇంటర్నేషనల్ సులబ్ ఇంటర్నేషనల్ సహకారంతో నిర్మించిన శౌచాలయాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులతో ప్రతిజిల్లాలోనూ ఇటువంటి శౌచాలయాలు నిర్మించే ఆలోచన ఉందని సులబ్ ఇంటర్నేషనల్ సంస్థ ముఖ్యులు అభిప్రాయపడ్డారు. రోటరీ 3192 చార్టెర్డ్ గవర్నర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ శౌచాలయంలో మంగళముఖిలతోపాటు సాధారణ శౌచాలయాలు ఉన్నాయని, దివ్యాంగులకు వీలయ్యేలా వీల్‌చెయిర్ వ్యవస్థ కల్పించామన్నారు.

సాధనతోనే ప్రగతి




ప్రశంసాపత్రాలతో చిన్నారులు

జాలహళ్ళి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సంతోషం, సాధనలు గర్వించదగిన అంశాలని వాటితో మరింత ప్రగతి సాధ్యమని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ హోమియోపతి వైద్యురాలు డాక్టర్ రమ్యశ్రీ అభిప్రాయపడ్డారు. రాజరాజేశ్వరి నగర్‌లోని లలిత్ క్యాసిల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ సెరిమని పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు డాక్టర్ బీఏ కళాశంకర్ అధ్యక్షత వహించగా రమ్యశ్రీ స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. చిన్నారులు ప్రత్యేకంగా యూనిఫాం ధరించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. క్రమశిక్షణతో మెలగాలని చక్కగా చదివి ఉన్నత హోదాలలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని తల్లిదండ్రులు కూడా వారిని మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భాశయ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళకు కాన్పు

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రెండుసార్లు సిజేరియన్ తర్వాత గర్భాశయ సమస్యలు ఎదుర్కొంటున్న మహిళకు నగరంలోని వాసవి ఆసుపత్రిలో కాన్పు జరిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ నిశాబూచాడ తెలిపిన మేరకు కలబురగికి చెందిన ఓ మహిళకు 26వారాల గర్భం నిండిందన్నారు. అప్పటికేసార్లు సిజేరియన్ కావడంతోపాటు అక్కడి వైద్యులు సూచించారని 600 కిలోమీటర్లు ప్రయాణించి బెంగళూరుకు వచ్చారన్నారు. సెంట్రల్‌ప్లాజెంటా ప్రివియాతోపాటు పలు సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. స్కాన్ ద్వారా ప్రమాదానికి గురైన గర్భాశయభాగానికి చికిత్సలు జరిపామన్నారు. తీవ్రరక్తస్రావమైందన్నారు. అత్యవసరంగా కాన్పు జరపాల్సి వచ్చిందన్నారు. ఏమాత్రం జాప్యం చేసినా పెను ప్రమాదం ఉండేదన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు కోలుకున్నట్టు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1595.07	1,581.64
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,191	844
నీటి నిల్వ (టీఎంసీలు)	15.79	5.32

మహిళలు స్వావలంబన సాధించాలి: కలెక్టర్



ప్రమాణ పత్రాలు అందజేస్తున్న జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి గాంధీనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వ సహాయ సంఘాల ద్వారా కుటీర పరిశ్రమాలు ప్రారంభించి స్వావలంబన సాధించాలని జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపు నిచ్చారు. జిల్లా పంచాయతీ, కౌశల్యాభివృద్ధి, పరిశ్రమలు, జీవనోపాయ శాఖ, సంజీవిని కర్ణాటక రాష్ట్ర గ్రామీణ జీవనోపాయ అభియాయన లింగత్వ పరివర్తన అభియాన కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా పంచాయతీ నజీర్ సభాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తోందని, ప్రభుత్వం నుండి లభించే పథకాలను సద్వినియోగంచేసుకోని ఆర్థికాభివృద్ధి సాధజంచాలని కోరారు. అనంతరం జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి హ్యారీస్ సుమైర్ మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకంలో సముదాయ ఆధారిత పనులు ప్రారంభం అవుతున్నాయని, ఉద్యోగ కార్డు పొందిన కుటుంబాలు ముఖ్యంగా మహిళలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళకుండా తమ తమ గ్రామాల్లో ప్రతి కుటుంబానికి వంద రోజుల వరకు నరేగా పనులు లభించేలా ప్రాణాళికలు సిద్ధం చేసినట్లు తెలలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని, ఎలాంటి సమయంలోనైనా ఆత్మస్థైర్యం కోల్పోరాదని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ జీవనోపాయ అభియాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న మూడు గ్రామ పంచాయతీ ప్రతినిధులకు ప్రమాణ పత్రాలు అందజేశారు.



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మిశ్రా

బళ్లారి కొండపై రోప్ వేకు స్థల పరిశీలన

బళ్లారి గాంధీనగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలో ఏకశిల కొండగా పేరుగాంచిన బళ్ళారి కొండకు రోప్ వే నిర్మాణం చేయాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పనులు చేపట్టిన 'మై రైట్ ' సంస్థ ప్రతినిధులు జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాతో స్థలపరిశీలన జరిపారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ ప్రతినిధులకు అవసరమైన సలహాలు, సూచలను జిల్లాధికారి అందజేశారు. ప్రస్తుతం పురాతత్వ శాఖ పరిధిలో ఉన్న బళ్ళారి కొండకు రోప్‌వే ప్రారంభం అయ్యే స్థలం నుండి చివరి ప్రాంతం గుర్తించేందుకు భారతీయ పురాతత్వ శాఖ అధికారులతో ఇదే సందర్భంలో జిల్లాధికారి, సంస్థ ప్రతినిధులు చర్చించారు. కొండ చుట్టు ప్రభుత్వ స్థళాలను గుర్తించాలని పురాతత్వ శాఖ అధికారులకు జిల్లాధికారి సూచించారు. ఈ విషయంపై డిల్లీలో భారతీయ పురాతత్వశాఖ అధికారులతో చర్చించి వీలైనంత పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామని జిల్లాధికారి తెలలిపారు. ఈ సందర్భంగా రైట్స్ సంస్థ ప్రతినిధి సతీష్ వర్మ, పురాతత్వ శాఖ అధికారి రవీంద్ర సి.ఎం. పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభులింగ ఎస్‌తళకేరి పాల్గొన్నారు.

దంపతుల మధ్య అవగాహన తప్పనిసరి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

బళ్లారిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో ఎస్సార్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణంలో శుక్రవారం సంతానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ సంతానం పట్ల దంపతులు అవగాహన కలిగి ఉండాలని, అపోహలు ఉండరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6న రాతిదూలం లాగుడు పోటీలు

గోరంట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరవ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి రోజు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు నిమ్మల శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 6న ఉదయం జరిగే పోటీల్లో గె లుపొందినవారికి ప్రథమ రూ.25 వేలు ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10 వేలు చెల్లిస్తామన్నారు.

రేపు తాయమ్మదేవి మహా రథోత్సవం



ముస్తాబైన ఆలయ ముఖద్వారం



అలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పర్వదినం ఉగాది రోజున తాయమ్మ దేవి మహా రథోత్సవం జరుగుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తెలిపారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన ఆరాధ్యదైవం తాయమ్మ దేవి మహారథోత్సవం సందర్భంగా అమావాస్య రోజున రాత్రి అఖండ భజన కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉగాది రోజున దేవికి వెండి కవచంతో అలంకారం, విజయ నగర కాలనీ యువతీ యువకులతో కోలాట ప్రదర్శన, సాయంత్రం దేవి పల్లకితో మహా రథోత్సవం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం లలిత కళా సాంఘీక నాటక ప్రదర్శన జరుగనుంది. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నీలకంఠారావు, కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి వెంకటరత్నం, శ్రీనివాస రాజు, ప్రధాన అర్చకులు పత్తార్ శ్రీనివాస, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు కిటకిట



బెంగళూరు రైలు వద్ద ప్రయాణికులు సందడి

బళ్లారి రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. నగరం నుంచి బెంగళూరు, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో చార్జీలు భారీగా పెంచేశారు. బెంగళూరులో ప్రైవేట్ ట్రావెల్స్ రూ.600 ఉన్న బస్ చార్జీలు రూ. వెయ్యి నుంచి రూ. 1200 వరకు పెంచేశారు.

పూల ధరలకు రెక్కలు

ఉగాది పండుగ, అమావాస్య సందర్భంగా పూలు, పండ్లకు రెక్కలు వచ్చాయి. కిలో బంతి పూల ధర రూ. వంద కావడంతో పాటు అరటి, మామిడి తదితర పంటల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

సాగునీటి కోసం రైతుల ఆందోళన



దేవదుర్గ రహదారిపై బైఠాయించిన రైతులు

రాయచూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కోసం రైతులు ఆందోళన బాట పడ్డారు. ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా ఏప్రిల్ 25వ తేదీ వరకు నారాయణపూర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని కోరినా పట్టించుకోకపోవడాన్ని రైతులు తీవ్రంగా నిరశించారు. ప్రభుత్వ వైఖరిని నిరశిస్తు శుక్రవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో దేవదుర్గ బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. నీటి తిరువ సలహ సమితి తీసుకున్న నిర్ణయం మేరకు మార్చి 25వ తేదీ నాటికి నీటి విడుదల నిలుపుదల చేయడంతో చేతికొచ్చే పంటలు నాశనమైయ్యే దుస్థితి తలెత్తిందంటు రైతులు ఆక్రోశం వెళ్లగక్కారు. పంటలు చేతికొస్తున్న తరుణంలో నీటి విడుదలకు పొడగింపు చేయాలని ఏప్రిల్ 20 వరకు నీటిని విడుదల చేయడం వల్ల లక్షల్లో అప్పులు చేసి వేసుకున్న పంటలు చేతికొస్తాయని ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడం కాంగ్రెస్ రైతు వ్యతిరేక ధోరణికి నిదర్శనమని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలి పాటీల్ ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు కాకుండా మొండిపట్టుతో మిర్చి 25న నీటి విడుదల నిలిపివేయడం శోచనీయమన్నారు. కాలువల కింద వేల ఎకరాల్లో సాగు చేసుకున్న వేర సెనగ, వరి, ఉల్లిపాయ తదితర పంటలు పూర్తిగా ఎండిపోయే దుస్థితి తలెత్తిందని దీంతో రైతులు పూర్తిగా ఆర్థికంగా కృంగిపోయే పరిస్థితి ఉందన్నారు. కాగా దేవదుర్గ బంద్ నిర్వహించిన నిరసనకార రైతులు స్థానిక జహిరుద్దీన్ పాషా సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు.

మహారాష్ట్ర బ్యాంక్‌లో భారీ కుంభకోణం..!

రాయచూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాయచూరు నగరంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో భారీ కుంభకోణం చోటు చేసుకుంది. కుంభకోణం సూత్రధారు,పాత్రధారి ఆ బ్యాంక్ మేనేజర్ కే నరేంద్ర రెడ్డి కావడం గమనార్హం. రూ.10 కోట్ల 97 లక్షల మేరకు 105 నకిలీ ఖాతాలను సృష్టించాడు. అందులో 29 మంది ఖాతాదారుల పేరుతో గోల్డ్ లోన్ ఇచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టించిన నరేంద్ర రెడ్డి అందులో 8 మంది తన బంధువుల పేర్ల పై ఉన్న అకౌంట్‌లకు నగదును మళ్లించినట్లు బ్యాంక్ ఆడిట్‌లో వెల్లడైంది. ఈ విషయం వెలుగు చూడగానే మేనేజర్ కే నరేంద్ర రెడ్డి పరారైయ్యాడు. రీజనల్ మేనేజర్ సుచేత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సైబర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మహారాష్ట్ర బ్యాంక్‌లో 10 కోట్లు గల్లంతైనట్లు తెలుసుకున్న బ్యాంక్ ఖాతాదారులు ఆందోళనలో ఉన్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

రాయచూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకా కల్లూరు గ్రామానికి చెందిన భక్తుడు బసవరాజ్ యాదవ్ పాదయాత్ర చేస్తు గుండెపోటుతో మృత్యువాత పడ్డాడు. కల్లూరు నుంచి 14 మంది భక్తులు పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరి వెళ్లగా గురువారం మధ్యహ్నాం వేళ బసవరాజ్ యాదవ్(40)కు గుండెపోటు రావడంతో మృత్యువాత పడ్డాడు. కర్నూల్ జిల్లా వెంకటపూరం నుంచి నల్లమల అటవి ప్రాంతం గుండా నడిచి వెళుతున్న భక్తులు భీమన కొలెను సమీపంలో చేరే సరికి ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. బసవరాజ్ యాదవ్‌కు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామం కల్లూరుకు తీసుకొచ్చారు. సాయంత్రం బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



కల్తీ వెన్నను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కల్తీ నెయ్యి తయారీ కేంద్రాలపై దాడులు

కంప్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బెనికేహాళ్ గ్రామంలో గత మూడు రోజులుగా కల్తీ వెన్న నెయ్యి తయారు చేస్తున్న ఇళ్లపై ఆహారశాఖ అధికారులు దాడి చేసి వారితో నుండి 40 ప్యాకెట్లు వెన్న ఐదు బాటిల్స్ నెయ్యి స్వాధీనం చేసుకున్నట్లు ఆహారశాఖ అధికారులు రేవన్న మంజునాథ్ తెలిపారు. గురువారం గ్రామంలోని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. తయారు చేస్తున్న శివలింగప్ప, ఎర్రగుడి, తిప్పేస్వామి, శంకర్, గోవింద్, ఈ ఐదు మందిపై హడగలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. ఇకపై ఎలాంటి వారైనా కల్తీ పనులకు సహకరించిన చేపట్టిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు తెలిపారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎస్‌ఐ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ అవినాష్ కాంబ్లే

కంప్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో సంఘ సంస్థలు నీటి దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ అవినాష్ కాంబ్లే తెలిపారు. కంప్లి పురసభ ముందు భాగంలో జేసీఐ సోనా సంస్థ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం ఉదయం ప్రారంభించి తెలిపారు. ఎండా కాలంలో జాగ్రత్తలు వహించకపోతే వడదెబ్బలు తప్పవన్నారు. అందువల్ల పదినిమిషాలకు ఒకసారి నీరు సేవించాలని తెలిపారు. ఇంట్లో తయారు చేసిన నిమ్మరసం ఆనందించడం మజ్జిగతో సహా పండ్ల పానీయాలను చిటికెడు ఉప్పుతో తీసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఉస్మాన్, పూర్వ అధ్యక్షులు నిరంజన్ గుప్తా, రాకేష్ డి మంజేష్, ఆర్ శాంతి లాలా బాలర్, ఇంద్రజిత్ సింగ్, ఆఫీస్ బేరర్లు అక్కిజిలాన్, ఇస్మాయిల్, బీహెచ్‌ఎం అమరాథ్ శాస్త్రి ప్రముఖులు జీ సుధాకర్, బసవరాజు, రమేష్, మున్సిపల్ జేఈ మేగన, మహమ్మద్ గౌస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి సన్మానం



గారపాటి రామకృష్ణను సన్మానిస్తున్న హోసూరు కమ్మ సంఘం సభ్యులు

కంప్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రుల సంక్షేమానికి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేపడుతున్న అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు గారిపాటి రామకృష్ణకు హోసూరులో శుక్రవారం కమ్మ సంఘం అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రవాస ప్రతి ఆంధ్రుడికి వెన్నంటే వుంటూ ఎంతో సహకారాలు చేపడుతూ కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పేరుగాంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అలాగే ఆంధ్రులు వుండే గ్రామాల్లో పట్టణంలో క్యాంపులో ధార్మిక సాంస్కృతిక మహాసభలు మరియు ఇతర కార్యక్రమాలు జరుపుతూ ఆంధ్ర ప్రజలలో ఉత్సాహం తీసుకొచ్చిన వ్యక్తి గుర్తింపు వుండిపోయారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సర్వేష్, శ్రీరామ్ చంద్రయ్య, శేషగిరిరావు, రాజన్న, గోవర్ధన్, లోకేష్, సమాజ పదాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు



రామ్ చరణ్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న అభిమానులు

సిరుగుప్ప, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సినీ చరిత్రలో రామ్‌చరణ్ ఉత్తమస్థాయికి ఎదగాలని మెగా అభిమానుల సంఘం అధ్యక్షుడు మూర్తి అభిప్రాయపడ్డారు. సిరుగుప్ప పట్టణం బసవేశ్వర వృద్ధాశ్రమంలో రామ్‌చరణ్ 40వ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు ఇంద్ర, మహేష్, పవన్, బండ్రాళ్ల మల్లికార్జున, అనుమేష, అభిమానులు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన పురసభ సమావేశం



సమావేశంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు

తోరణగల్లు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కురేకుప్ప పురసభ భవనంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరగనుంది. కురేకుప్ప పురసభ కార్యాలయంలో 2025-26 సంవత్సరంలో ఆదాయ ఖర్చుల సమావేశం జరిగింది. వివిధ మార్గాల ద్వారా ఆదాయం ఖర్చులు పోను రూ.3.97 లక్షలు మిగులు బడ్జెట్‌ను పురసభలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, అధికారుల ఆధ్వర్యంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పురసభ సభ్యులు సోమప్ప బడ్జెట్‌పై మాట్లాడారు. ఈ సందర్భంగా పురసభ అధికారి సతీష్ పురసభ అధ్యక్షుడు కల్లుడప్ప, పురసభ అధ్యక్షురాలు, పురసభ పాలక సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి రైతు సమస్యలు..

రాయచూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నారాయణపూర్ కుడికాలువ పరిధిలో సాగు చేసిన పంటలు ఎండిపోతునందున నీటి విడుదల తేదీ పొడగించాలని రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరారు. శుక్రవారం బెంగళూరులో సీఎం నివాసానికి వెళ్లిన ఎంపీ ఇక్కడి రైతుల స్థితిగతులు, పంట సాగు తదితర వివరాలను సీఎం దృష్టికి తెచ్చినట్లు ఎంపీ వివరించారు. పంటలకు మరో 15 రోజుల పాటు నీటిని పొడగిస్తే పూర్తి స్థాయిలో పంటలు చేతికందుతాయని తద్వార రైతులకు ఎలాంటి నష్టం ఉండదంటు ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు. 25న నీటి విడుదల నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తిందని తెలిపారు.

హోసూరు జోన్

బూత్‌స్థాయి పదాధికారుల నియామకం



నియామకపత్రాలు అందజేస్తున్న యూనియన్ కార్యదర్శి బాబు

హోసూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గ పరిధిలోని సొన్నెపురం, పేరండపల్లి, పాతాలపల్లి ప్రాంతాల్లో శూలగిరి వెస్ట్ యూనియన్ అన్నాడీఎంకే బూత్ కమిటీ పదాధికారులను నియమించారు. యూనియన్ కార్యదర్శి బాబు అధ్యక్షత వహించారు. పశ్చిమజిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గ పదాధికారులు పన్నీర్‌సెల్వం పాల్గొని కమిటీ సభ్యులను నియమించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా, సంయుక్త పాలనా పదాధికారులు, బూత్‌కమిటీ నిర్వాహకులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో బస్సుల తనిఖీ

హోసూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (ఆపరేషన్) చెన్నై కు చెందిన చంద్రశేఖర్ నేతృత్వంలో గురువారం రాత్రి 8 గంటలనుంచి శుక్రవారం ఉదయం వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పన్ను చెల్లించని, సరైన పత్రాలు లేని 13 ఓమ్ని వాహనాలు, బస్సులను స్వాధీనం చేసుకున్నారు. హోసూరు ప్రాంతీయ రవాణా కార్యాలయానికి తరలించారు. కార్యాచరణలో హోసూరు ప్రాంతీయ రవాణా అధికారి ప్రభాకర్, వేలూరు దురైస్వామి, చెన్నై కార్గో ప్రాసెసింగ్ డివిజన్ ప్రాంతీయ రవాణా అధికారి సింహారవేలు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మణిమారన్ పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న బస్సులు



రాయకోటె రోడ్డు దుస్థితిపై సభలో ప్రశ్నించిన ఎమ్మెల్యే

హోసూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో టీవీఎస్ ఫ్యాక్టరీ నుంచి రాయకోటె రోడ్డు అంశాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ అసెంబ్లీలో ప్రస్తావించారు. రెండువరుసల రహదారిని నాలుగులైన్‌లుగా మార్చారని ఇందులో తాలిశాల వద్ద మూడు కిలోమీటర్లు ఉండగా టీవీఎస్ నుంచి రాయకోట్టై వరకు 2కిలోమీటర్లు రోడ్డు వేయలేదన్నారు. దీనిపై మంత్రి వేలు బదులిస్తూ హోసూరు నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నగరమని సీఎం రోడ్డు డెవలెప్‌మెంట్ స్కీమ్ కింద నాలుగులైన్ల రోడ్డుగా విస్తరిస్తున్నామన్నారు. మధ్యలో ఉన్న రెండుచోట్ల ఇరుకుగా ఉండడంతో నాలుగులైన్ల రోడ్డుగా మార్చడం సాధ్యం కాలేదన్నారు. నిబంధనలకు లోబడి ఉంటే ఈ ఏడాది పరిశీలిస్తామన్నారు.

ఆదియమాన్ కళాశాలలో జాతీయ సదస్సు

హోసూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హోసూరు ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సదస్సు జరిగింది. షేపింగ్ ఫ్యూచర్ మెకానికల్ ఇంజనీర్స్ అనే పేరిట మెకానికల్ ఇంజనర్లను స్టాండర్స్‌గా రూపొందించడం ఎలా అనే అంశంపై చర్చించారు. మెకానికల్ విభాగాధిపతి సురేశ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్‌లు మాట్లాడుతూ ఫ్యాక్టరీలు తయారు చేసే ఉత్పత్తుల నాణ్యతలో బీఎస్‌ఐ నాణ్యతా ప్రమాణాల గురించి వివరించారు. ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో నాణ్యత కూడా ఎంతో కీలకమన్నారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

నీ వెంటే నేను..!

అనారోగ్యంతో భార్య మృతి
బాధతో.. మరుసటి రోజే భర్త కూడా..

రాయచూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏడడుగుల బంధం ఏడు జన్మల బంధం అనేందుకు నిదర్శనంగా జిల్లాలోని మాన్వి తాలూకా కపగల్‌లో భార్య,భర్తల మరణం సంభవించింది. గంటల వ్యవధిలో ఇద్దరు మృత్యువాతపడడం గ్రామస్థులనే కాక చుట్టుముట్టు ఉన్న గ్రామస్థులను సహితం ఆశ్చార్యానికి గురిచేసింది. మాన్వి తాలూకా కపగల్‌కు చెందిన అమరమ్మకు పక్షవాతం రాగా గత 6 నెలలుగా పక్షవాతంతో పోరాడుతూ గురువారం రాత్రి కన్నుమూసింది. భార్య కన్ను మూసిందన్న వార్త తెలుసుకున్న భర్త రాజశేఖర్ మానసిక వేదనకు గురై శుక్రవారం తెల్లవారు జామున మృత్యువాతపడ్డాడు. దీంతో ఒక్కసారిగా గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురైయ్యారు. దంపతులకు ఒక కుమార్తై, ఒక కుమారుడు ఉన్నారు. బంధువులతో కలిసి శుక్రవారం గ్రామంలో దంపతుల అంత్యక్రియలు నిర్వహించారు.



రాజశేఖర్



అమరమ్మ(ఫైల్)